క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

సత్తెనపల్లి: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశం ఈ నెల 30న ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి అధ్యక్షతన జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద కుమార్ గురువారం తెలిపారు. సమావేశంలో ఆయా అజెండాలలోని అంశాలపై చర్చించి ఆమోదించటం జరుగుతుందన్నారు. సమావేశానికి ఎక్స్ అఫీషియోగా స్థానిక శాసన సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ హాజరవుతారన్నారు. అన్ని వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు హాజరు కావాలన్నారు.

31న కల్యాణ వేంకటేశ్వరుని ఆలయ వార్షికోత్సవం

కుందురువారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని కుందురువారిపాలెం గ్రామంలో వేంచేసియున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ రెండవ వార్షికోత్సవం ఈ నెల 31వ తేదీన జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. స్వామి వారికి జరిగే ప్రత్యేక పూజల్లో పాల్గొనేందుకు ఆసక్తి గలవారు ముందస్తు సమాచారం అందించాలని కోరారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు



రాజుపాలెం: పేద మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు నైపుణ్యాలతో కూడిన శిక్షణను ఇస్తున్నట్లు యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ టి.మాధురి అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంకు స్వయం ఉపాధి శిక్షణ ద్వారా మండలంలోని అనుపాలెం గ్రామంలో ఎస్సీ మహిళలకు పలు వృత్తులపై శిక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం సర్టిఫికెట్‌లు, యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమానికి డీబీఆర్‌సీ ఏరియా కో ఆర్డినేటర్ కోటిరత్నం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూనియన్ బ్యాంకు స్వయం ఉపాధి శిక్షణ ద్వారా గ్రామంలోని 33 మంది మహిళలకు ఫినాయిల్, సర్ఫ్, పాత్రలు శుభ్రం చేసే లిక్విడ్, జెండుబామ్ తదితర కెమికల్స్ తయారీపై ఉచిత శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్‌లు మంజూరు చేశామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారు సొంతంగా వ్యాపారం ప్రారంభించేందుకు బ్యాంకు ద్వారా ఆర్థిక చేయూత నిస్తామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ డి.సంగీత, డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్ సీహెచ్ మురళి, సిబ్బంది వి.ధనుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

జానీ కుటుంబానికి అండగా ఉంటాను

మార్నింగ్ స్టార్ అధినేత జవ్వాది సతీష్



పెదకూరపాడు: సీనియర్ రాజకీయ నేత పెదకూరపాడుకు చెందిన షేక్ జానీ కుటుంబానికి అండగా ఉంటానని మార్నింగ్ స్టార్ అధినేత జవ్వాది సతీష్ అన్నారు. గురువారం పెదకూరపాడులోని జానీ గృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదానికి గురై మంచానికే పరిమితమైన జానీకి ఎయిర్ బెడ్, స్టాండ్‌ను అందజేశారు. జానీ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సీనియర్ నేత ప్రమాదానికి గురై మంచానికే పరిమితం కావటం బాధాకరమన్నారు. భవిష్యత్తులో జానీ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్ద ముస్తఫా, గ్రామస్తులు మణికంఠ, వెలగా గోపి పాల్గొన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

అమరావతి: మండల పరిధిలోని రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీపై అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని మండల వ్యవసాయాధికారి అహ్మద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలలో 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తామన్నారు. రైతులకు జనుము విత్తనాలు కేజీ రూ.109 కాగా సబ్సిడీపై రూ.54.50కు, జీలుగ విత్తనాలు కేజీ రూ.123 కాగా రూ.61.50కు, పిల్లి పెసర కేజీ రూ.180 కాగా రూ.90కు సోమవారం నుంచి పంపిణీ చేస్తామన్నారు. సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు అధార్‌కార్డు, పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్‌లతో రైతు సేవా కేంద్రాలలో సంప్రదించాలన్నారు.

అత్యాచారంపై కేసు నమోదు

ముప్పాళ్ళ: మాయమాటలు చెప్పి ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి అత్యాచారంకు పాల్పడ్డాడంటూ వివాహిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వి.సోమేశ్వరరావు గురువారం తెలిపారు. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలంలోని కంకణాలపల్లికి చెందిన ఓ వివాహిత మహిళను సత్తెనపల్లి మండలం భృగుబండ గ్రామానికి చెందిన యువకుడు మాయమాటలు చెప్పి సత్తెనపల్లిలోని గడియార స్తంభం వద్ద ద్విచక్ర వాహనం ఎక్కించుకొని ముప్పాళ్ళ వైపు తీసుకెళ్లి అత్యాచారం చేశాడంటూ ముప్పాళ్ళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సమస్యల మధ్యే నివాసం



రామాంజనేయపురం ప్రధాన బజారు

- అభివృద్ధి జాడలేని రామాంజనేయపురం గ్రామం
- గత ప్రభుత్వ హయాంలో నెరవేరిన పాఠశాల కల
- ప్రత్యేక పంచాయతీగా గుర్తించాలని వేడుకోలు

బెల్లంకొండ: చదువు లేకుండా, సమాజంతో సంబంధం లేకుండా.. అడవి తల్లినే నమ్ముకున్న అమాయకపు గిరిజనుల జీవితాలలో ఇంకా వెలుగులు రాలేదు. పంచాయతీకి దూరంగా నివాసం ఉంటున్న వారి అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉంది. ఉపాధి లేక వలస బాట పడుతున్నా ప్రభుత్వం మాత్రం మొద్దు నిద్ర వీడటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెం పంచాయతీ పరిధిలో గ్రామానికి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న రామాంజనేయపురం గిరిజనుల పరిస్థితి దయనీయంగా ఉంది. కనీస సౌకర్యాలు లేక ఎన్నో ఏళ్లుగా నరకయాతన అనుభవిస్తున్నారు. కరువు పరిస్థితుల సమయంలో ఈ ప్రాంతానికి వచ్చి ఇళ్ల



గ్రామంలోని పూరి గుడిశెలు

కట్టుకున్న వారి పరిస్థితి ఎదుగూ బదుగూ లేకుండా ఇప్పటికీ అలానే ఉంది. దాదాపు 200 ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నా ప్రత్యేక పంచాయతీగా గుర్తించకపోవడంతో వారిని పట్టించుకునే నాథుడు కరువయ్యారని వాపోతున్నారు.

- గ్రామంలోని సమస్యలు తీరాలంటే ప్రత్యేక పంచాయతీగా తమ ప్రాంతాన్ని గుర్తించాలని వారు వేడుకుంటున్నారు. అటవీ ప్రాంతంలో ఉండటంతో తాగేందుకు మంచి నీటి బోరు వేయించుకుందామన్నా అటవీ శాఖ అధికారులు అడ్డంకులు సృష్టిస్తున్నారని అంటున్నారు. ఓటు హక్కు ఉన్నా అభివృద్ధి మాత్రం తమ దరిచేరడం లేదని ఆవేదన చెందుతున్నారు.

200 కుటుంబాలకు పైగా...

దాదాపు 30 ఏళ్ల క్రితం తెలంగాణలోని నల్గొండ, హుజూర్‌నగర్, మిరియాలగూడ తదితర ప్రాంతాలలో కరువు సంభవించిన సమయంలో వారి కులానికి చెందిన పెద్ద ఒకరు ఈ ప్రాంతంలో నివసించేందుకు వలస రావడం జరిగింది. దీంతో క్రమేపీ ఒక్కొక్కరుగా ఈ ప్రాంతానికి వలస వచ్చి నివాసాలు ఏర్పరచుకున్నారు. అనంతరం ఎన్నికలు వచ్చిన సమయంలో దగ్గరగా ఉన్న మన్నెసుల్తాన్‌పాలెం పంచాయతీ ద్వారా వారిలో కొంత మందికి ఓటు హక్కు, రేషన్ కార్డులు మంజూరు చేయడం జరిగింది. ప్రస్తుతం ఇక్కడ 200 కుటుంబాలకు పైగా నివాసం ఉంటున్నారు.

రేషన్ కార్డులకే పరిమితం

ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్నా వారి అభివృద్ధి మాత్రం రేషన్ కార్డుల వరకే పరిమితమైంది. దాదాపు 15 బజార్లు ఉన్నా ఒక్క సిమెంటు రోడ్డు కనిపించదు. గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టినా.. వారి గ్రామ పొలిమేరను తాకలేదు. ఒక్కరికి కూడా పక్కా ఇళ్లు లేవు. ముళ్ల పొదల మధ్యనే నివాసం.. డ్రైనేజీ, తాగు నీటి సౌకర్యం అందనంత దూరంలో ఉన్నారు. గ్రామంలో 2020 వరకు కనీసం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కూడా లేదు. చదువుకోవాలంటే మన్నెసుల్తాన్‌పాలెం, పాపాయపాలెం వెళ్లాల్సిందే. రేషన్ సరుకులకు కూడా అక్కడకు వెళ్లి తెచ్చుకోవాల్సిందే.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామంలో అభివృద్ధికి అడుగులు పడ్డాయి. గ్రామస్తుల సమస్యలను ప్రత్యక్షంగా చూసిన మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు వారి సమస్యలను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో గ్రామానికి ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను మంజూరు చేయించి, నిర్మాణాలను ఏడాది కాలంలో పూర్తి చేయించారు. అదే విధంగా తాగు నీటి సమస్య లేకుండా పలు వీధుల్లో బోర్లు వేయించారు. గ్రామంలోని అంతర్గత వీధుల్లో గ్రావెల్ తోలించి, బాగు చేయించారు.



గత ప్రభుత్వం హయాంలో నిర్మించిన పాఠశాల

కనీస సౌకర్యాలు లేవు

మా కాలనీలోకి వచ్చేందుకు రోడ్లు లేవు. తాగు నీటి సమస్య తీవ్రంగా ఉన్నా బోర్లు వేయించుకోనివ్వడం లేదు. వారు వేయడం లేదు. పిల్లలు చదుకునేందుకు స్కూళ్లు లేవు. దూరం వెళ్లి చదువుకోవాల్సిందే. ఒక్క ఇంటిని కూడా ప్రభుత్వం మంజూరు చేయలేదు. అడవితల్లినే నమ్ముకుని జీవనం సాగిస్తున్నాం.

– తులిశానాయక్, రామాంజనేయపురం

ప్రత్యేక పంచాయతీగా గుర్తించాలి

నేను రామాంజనేయపురంలో దాదాపు 35 ఏళ్లుగా నివాసం ఉంటున్నా. అటవీ ప్రాంతంలో ఉండటంతో అభివృద్ధికి నోచుకోలేదు. గత ప్రభుత్వంలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం నిర్మించారు. పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రస్తుత పాలకులు తమ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా గుర్తించాలి.

– బొడ్డుపల్లి రాము, మాజీ సర్పంచ్, రామాంజనేయపురం

ఆర్టీసీలో ఇన్ బస్ పార్సిల్ బుకింగ్ సర్వీస్

గుంటూరు–1 డిపో ఇన్‌చార్జి మేనేజర్ రాజశేఖర్

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట రోడ్ రవాణా సంస్థ కార్గో, పార్సిల్ రవాణాను గత ఆరు సంవత్సరాల నుంచి ఆన్‌లైన్ విధానంలో వినియోగదారులకు తక్కువ ఖర్చు.. తక్కువ కాలములో అందిస్తుందని గుంటూరు–1 డిపో ఇన్‌చార్జి మేనేజర్ రాజశేఖర్ గురువారం తెలిపారు. ఏపీఎస్‌ఆర్టీసీ కార్గో యాప్ ద్వారా బుక్ చేసిన పార్సిల్ గమనమును ఎప్పటికప్పుడు వినియోగదారుడు తెలుసుకొనే అవకాశం ఉందన్నారు. ఏపీఎస్‌ఆర్టీసీ పార్సిల్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి నూతనంగా ఇన్ బస్ పార్సిల్ బుకింగ్ సర్వీస్‌ను వచ్చే నెల 1వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నామన్నారు. ఈ సర్వీస్ ద్వారా ప్రజలు తమ కొరియర్ లేదా పార్సిల్‌ను బస్‌లోనే కండక్టర్ వద్ద బుక్ చేసుకొని గమ్యస్థానాలకు పంపవచ్చన్నారు. 250 గ్రాములలోపు ఉంటే కొరియర్‌గా, 250గ్రా. నుంచి 5 కేజీల వరకు పార్సిల్‌గా బస్‌లో కండక్టర్ వద్ద బుక్ చేసుకోవచ్చన్నారు. 250గ్రా. నుంచి 5 కేజీల వరకు 75 కిలోమీటర్ల వరకు రూ.60–80, అలాగే 76 నుంచి 200 కిలోమీటర్ల వరకు రూ.90–95, 201 నుంచి 500 కిలోమీటర్ల వరకు రూ.120–175, 500 కిలోమీటర్ల పైన రూ.150–275 చార్జీ చేస్తారన్నారు. పార్సిల్ లేదా కొరియర్ బుకింగ్ సమయంలో బుక్ చేసే వారి, పార్సిల్ తీసుకునే వారి ఫోన్ నెంబర్‌లను ఇవ్వవలసి ఉంటుందన్నారు. ఈ సేవలను ప్రజలు, రైతులు, వ్యాపారస్తులు సద్వినియోగం చేసుకోవాలని గుంటూరు–1 డిపో ఇన్‌చార్జి మేనేజర్ రాజశేఖర్ కోరారు.

దేవాలయ స్థలం కబ్జాపై ఎస్పీకి ఫిర్యాదు



సత్తెనపల్లి: పట్టణంలోని మూడో వార్డు సుగాలి కాలనీలో దేవాలయ స్థలాన్ని హోంగార్డు రవీంద్ర నాయక్, ఆర్టీసీ ఉద్యోగి రామ్‌సింగ్ నాయక్‌లు కబ్జా చేస్తున్నారంటూ కాలనీవాసులు గురువారం జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. స్థల కొలతలకు రావాలని నోటీసులు పంపిస్తే.. ముందస్తు వ్యూహంతో దాడి చేసి దూషించారని ఆవేదన వ్యక్త పరిచారు. ఈసారి కొలతలు అని ఎవరైనా వస్తే దేవాలయం స్థలంలో చంపి పాతి పెడతామంటూ దూషించారని, దీనిపై విచారించి న్యాయం చేయాలని సుగాలికాలనీ వాసులు లిఖిత పూర్వకంగా ఎస్పీకి విన్నవించారు.

సుబాబుల్ పంట నరికివేత

నరసరావుపేట రూరల్: పొలంలోకి అక్రమంగా ప్రవేశించి సుబాబుల్ పంటను తొలగిస్తున్న వారిని ప్రశ్నించినందుకు తనపై కత్తులతో హత్యాయత్నానికి ప్రయత్నించినట్లు రెడ్డినగర్‌కు చెందిన వెన్నా మాధవి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. రావిపాడు పంచాయతీ పరిధిలోని ఆదిత్య వెంచర్‌లో నాకు 2.10 ఎకరాల భూమి ఉందని, ఈ భూమిలో మూడు సంవత్సరాల క్రితం సుబాబుల్ పంటను వేసినట్లు ఫిర్యాదులో తెలిపారు. పంటను చూసేందుకు గురువారం సాయంత్రం 4 గంటలకు బంధువైన వెన్నా రాజశేఖరరెడ్డితో కలిసి వెళ్లగా మిషన్‌తో సుబాబుల్‌ను తొలగిస్తున్నారని పేర్కొన్నారు. ఈ భూమికి సమీపంలో రామిరెడ్డిపేటకు చెందిన కోటపాటి సాయికృష్ణ ఇళ్లను నిర్మిస్తున్నాడని, నిర్మాణాలకు అడ్డుగా ఉందని సుబాబుల్ తోటను తొలగిస్తున్నారని తెలిపారు. ఎందుకు తొలగిస్తున్నారని ప్రశ్నించినందుకు సాయికృష్ణతో పాటు మరికొందరు కత్తులతో దాడి చేశారని వివరించారు. ఫిర్యాదుపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్ఐ కిషోర్ తెలిపారు.

కిరాణా దుకాణంలో దోపిడీకి విఫల యత్నం

సత్తెనపల్లి: దొంగల ముఠా దోపిడీకి యత్నించి దాడికి పాల్పడిన ఘటన సత్తెనపల్లి రైల్వే గేట్ సమీపంలోని అబ్బూరురోడ్‌లో బుధవారం అర్ధరాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. అబ్బూరురోడ్డులోని ఓ కిరాణా దుకాణంలో బుధవారం రాత్రి ముగ్గురు వ్యక్తులు 10.30 గంటల సమయంలో వచ్చి సిగరెట్లు, అగిపెట్టె, వాటర్ బాటిల్స్ కొనుగోలు చేసి దూరంగా నిలిపిన కారు వద్దకు వెళ్లారు. దుకాణ యజమాని కొత్త వెంకట శ్రీనివాసరావు దుకాణం మూసివేశాడు. ఇంటిలో కరెంట్ లేకపోవడంతో 11.30 గంటలకు యజమాని శ్రీనివాసరావు బయటకు వచ్చాడు. తన గృహానికి మాత్రమే కరెంట్ లేకపోవడంతో ఫ్యూజును పరిశీలించేందుకు వెళ్లగా.. అప్పటికే వరండాలో మాటు వేసి ఉన్న వ్యక్తి ఒక్కసారిగా గొంతు నులిమేందుకు యత్నించగా యజమాని భార్య పెద్దగా కేకలు పెట్టడంతో ఒకరు గోడ దూకి, మరొకరు కారు వైపు, ఇంకొకరు రోడ్డు వైపు పరుగులు తీశారు. యజమాని గొంతు నులిమే క్రమంలో జరిగిన పెనుగులాటలో శ్రీనివాసరావు చేతికి గాయమైంది. ఈ ఘటనపై శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాయాలైన శ్రీనివాసరావు ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నాటకాన్ని బతికిద్దాం.. నటులను ప్రోత్సహిద్దాం

ముగిసిన జాతీయస్థాయి నాటికల పోటీలు

నాదెండ్ల: నాటకాన్ని బతికిద్దాం.. నటులు, రచయితలు, దర్శకులు, సాంకేతిక నిపుణులను ప్రోత్సహిద్దామంటూ పలువురు వక్తలు వ్యాఖ్యానించారు. పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం సాతులూరు గ్రామంలో ఎన్టీఆర్ కళాపరిషత్ తృతీయ జాతీయస్థాయి నాటిక పోటీలు బుధవారం రాత్రితో ముగిశాయి. గత ఐదు రోజులుగా జరుగుతున్న పోటీలు కళాప్రియులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సభాధ్యక్షుడిగా వజ్జా మధుసూధనరావు వ్యవహరించగా, ముఖ్యఅతిథులుగా సర్పంచ్ శోభారాణి, డాక్టర్ శరశ్చంద్ర, బొప్పన నరసింహారావు, చలసాని కృష్ణప్రసాద్, గరికపాటి వెంకటరావు, మానం వెంకటేశ్వర్లు, రామరాజు శ్రీనివాసరావు, అప్పసాని నాగమల్లేశ్వరరావు, ముప్ప శ్రీనివాసరావు, యార్లగడ్డ బుచ్చయ్యచౌదరి హాజరయ్యారు. ఈ సందర్భంగా అమృతవర్షిణి, సాయిసుప్రియ లకు పురస్కారాలు అందించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ మూడేళ్లుగా కళాపరిషత్ ఆధ్వర్యంలో నాటికలు నిర్వహించటం అభినందనీయమన్నారు. లోటుపాట్లుంటే సవరించకుని భవిష్యత్‌లో మరింత గొప్పగా నాటికల పోటీలు జరపాలని ఆకాంక్షించారు.



ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన

ఆకట్టుకున్న ప్రదర్శనలు

తాడేపల్లి అరవింద ఆర్ట్స్ 'విడాకులు కావాలి' నాటికకు రచయితగా వల్లూరి శివప్రసాద్, దర్శకత్వం గంగోత్రి సాయి, తెనాలి అద్దేపల్లి ఆరాధ్యుల ఆర్ట్స్ 'ఎవరు' నాటికకు రచయితగా ఆరాధ్యుల తేజస్వీ ప్రఖ్య, దర్శకుడిగా అద్దేపల్లి లక్ష్మణ శాస్త్రి, కట్రపాడు ఉషోదయ కళానికేతన్ 'కిడ్నాప్' రచయిత, దర్శకత్వం చెరుకూరి సాంబశివరావు వహించారు. ఆయా నాటికలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం చిన్నారుల నృత్యప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమాలను కళాపరిషత్ నిర్వాహకులు నడింపల్లి వెంకటేశ్వరరావు, బండారుపల్లి సత్యనారాయణ, జరుగుల రామారావు, చెరుకూరి సాంబశివరావు పర్యవేక్షించారు.

31న మెగా జాబ్‌మేళా

వినుకొండ: పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిరుద్యోగ యువత కోసం మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి టి. తమ్మాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో మొత్తం 26 కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. 10, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ చదువుకున్న అభ్యర్థులు బయోడేటాతో సంబంధిత పత్రాలతో హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9951214919, 9100566581, 7702921219 నంబర్లను సంప్రదించాలన్నారు.

మోసం చేసిన కేసులో నిందితుడి అరెస్ట్

నరసరావుపేటటౌన్: రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగిని మోసం చేసిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ హైమారావు గురువారం తెలిపారు. వెంగళరెడ్డి కాలనీకి చెందిన సయ్యద్ ఉస్మాన్ ఆర్మీలో పనిచేస్తూ 2006లో ఉద్యోగ విరమణ పొందాడు. ఆ సమయంలో వచ్చిన నగదుతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆస్తులు కొన్నాడు. రిజిస్ట్రేషన్ సమయానికి కొంత డబ్బులు అవసరమై శ్రీనివాసనగర్‌కు చెందిన వడ్డీ వ్యాపారి వెన్నపూస జోసఫ్‌రెడ్డిని ఆశ్రయించాడు. జోసఫ్ మల్లమ్మ సెంటర్‌లో నిర్వహిస్తున్న వెంకట పద్మావతి ఫైనాన్స్ అండ్ చిట్‌ఫండ్ కార్యాలయం ద్వారా నగదు ఇచ్చి తాకట్టు కింద భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. దీంతో పాటు షూరిటీ కింద ఖాళీ చెక్కులు, నోట్లు తీసుకున్నాడు. తీసుకున్న డబ్బులు విడతల వారీగా వడ్డీతో సహా ఉస్మాన్ చెల్లించినప్పటికీ ఆస్తి తిరిగి రిజిస్ట్రేషన్ చేయకుండా జోసఫ్‌రెడ్డి కాలయాపన చేస్తూ వచ్చాడు. ఈ క్రమంలో ఆర్మీ ఉద్యోగి ఉస్మాన్ మరి కొందరు వెళ్లి తమ ఆస్తి రిజిస్ట్రేషన్ చేయాలని నిలదీశారు. అతనిపై జోసఫ్‌రెడ్డి, అతని బంధువు సుధాకర్‌రెడి దాడికి పాల్పడ్డారు. బాధితుడు ఉస్మాన్ ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రాథమిక దర్యాప్తు అనంతరం ప్రధాన నిందితుడు జోసఫ్‌రెడ్డిని అరెస్ట్ చేయగా మరో నిందితుడు వెన్నపూస సుధాకర్‌రెడ్డిని త్వరలో అరెస్ట్ చేస్తామని సీఐ తెలిపారు.

భయపడవద్దు.. తోడుగా ఉన్నాం



రెంటపాళ్ళలో మృతుడు తండ్రి కొర్లకుంట వెంకటేశ్వర్లుతో మాజీ మంత్రి విడదల రజని, నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సుధీర్ భార్గవ్‌రెడ్డి

సత్తెనపల్లి: మీరు ఏమి ఇబ్బంది పడవద్దు, భయపడవద్దు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మీకు అండగా ఉన్నారు. మేమందరం మీకు తోడుగా ఉన్నాం.. అండగా ఉంటామని ఎమ్మెల్సీ, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ తలశిల రఘురామ్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ మంత్రి విడదల రజని, నరసరావుపేట మాజీ శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి, సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి అన్నారు. సత్తెనపల్లి మండలం రెంటపాళ్ళ గ్రామంలో గురువారం వారు పర్యటించారు. ఏడాది క్రితం టీడీపీ, జనసేన నేతల దాడులు, పోలీసుల వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న రెంటపాళ్ళ ఉప సర్పంచ్, వైఎస్సార్‌సీపీ క్రియాశీలక నాయకుడు కొర్లకుంట శివ నాగమల్లేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యాన్ని కలిగించారు. మృతుడు తండ్రి, పాకాలపాడు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కొర్లకుంట వెంకటేశ్వర్లుతో వారు మాట్లాడారు.

జూన్ 1 నుంచి డీలర్లు రేషన్ సక్రమంగా అందించాలి

తహసీల్దార్ వి.వి.నాగరాజు

క్రోసూరు: వచ్చే నెల నుంచి రేషన్ డీలర్లందరూ కార్డుదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా రేషన్ సక్రమంగా అందించాలని తహసీల్దార్ వీవీ నాగరాజు తెలిపారు. గురువారం రేషన్ డీలర్లతో తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన రేషన్ పంపిణీపై పలు సూచనలు చేసారు. ప్రతి గ్రామంలో కార్డుదారులు రేషన్ షాపులకు వచ్చి రేషన్ తీసుకోవాలని తెలిసేలా ప్రచారం చేయాలన్నారు. రేషన్ షాపులు ఉదయం 8 గంటల నుంచి మధ్యాన్నం 12 వరకు అదేవిధంగా సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు తెరిచి డీలర్లు అందుబాటులో ఉండి రేషన్ అందించాలన్నారు.



రేషన్ డీలర్లతో సమావేశంలో తహసీల్దార్ నాగరాజు

రేషన్ షాపుల వద్ద కార్డుదారులకు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, ఎటువంటి అవకతవకలకు పాల్పడకూడదని తెలిపారు. మండలంలోని 42 మంది రేషన్ డీలర్లు హాజరయ్యారు.

ఒత్తిడిని అధిగమించేందుకు యోగా తోడ్పాటు

ఎంఈవో బి.రాజకుమారి

బెల్లంకొండ: నిత్యజీవితంలో ఒత్తిడిని అధిగమించేందుకు యోగా తోడ్పడుతుందని మండల విద్యాశాఖ అధికారి బి.రాజకుమారి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో విద్యా శాఖ ఆధ్వర్యంలో యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రతి రోజు యోగా చేయడం అలవాటుగా చేసుకోవాలని సూచించారు. యోగాసనాల ద్వారా అనేక రుగ్మతలకు దూరంగా ఉండవచ్చని తెలిపారు. ఆయుర్వేద వైద్యుడు ఆర్ శ్రీనివాస్ మాట్లాడుతూ యోగాపై గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. యోగాంధ్ర యాప్ ద్వారా ప్రతి ఒక్కరూ యోగా నమోదులో పాల్గొనాలని కోరారు.



యోగాసనాలు వేస్తున్న ఎంఈవోలు, ఆయుర్వేద వైద్యులు, ఉపాధ్యాయులు

కార్యక్రమంలో ఎంఈవో–2 ఎస్.బాలసుందరరావు, యోగా టీచర్లు హనుమంతరావు నాయక్, కోటేశ్వరమ్మ, వెంకటరెడ్డి, సాయి, వెంకటరామయ్య, సీఆర్పీలు నరసింహారావు, సాంబశివరావు, ఆసియా బేగం, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్లక్ష్యం చేయవద్దు

నూజెండ్ల: ప్లాస్టిక్ వ్యర్థాలలో ఉండే రసాయనాలు మానవ ఆరోగ్యానికి హానికరమని స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ కో ఆర్డినేటర్ కంచర్ల సుబ్బరామయ్య అన్నారు. మండలంలోని తలార్లపల్లె గ్రామ పంచా యితీ పరిధిలో గల గొల్లపాలెం గ్రామంలో వ్యర్థాల నిషేధంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కంచర్ల సుబ్బరామయ్య మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను వాడి ఎక్కడ పడితే అక్కడ పడవేయడం వలన నీటి కాలుష్యం, వాయు కాలుష్యం ఏర్పడి కాన్సర్ లాంటి ప్రమాదకరమైన వ్యాధుల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నా యని తెలిపారు. ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా పేపర్, జూట్, క్లాత్ సంచులను ఉపయోగించా లని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ మీసాల వెంకట శ్రీనివాస రావు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అగాహన

వినుకొండ : మండలంలోని నాగులవరం, గోకనకొండ గ్రామాల్లో ప్లాస్టిక్ నిషేధంపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా



ప్లాస్టిక్ వ్యర్థాలపై అవగాహన ర్యాలీ

డిప్యూటీ ఎంపీడీవో సుందరరెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడక వల్ల గాలి, నీరు, భూమి కలుషితమై మానవాళి భవిష్యత్‌పై ప్రభావం చూపుతుందన్నారు. ప్రతిఒక్కరూ ఒక మొక్కను నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలన్నారు. ప్లాస్టిక్ కాల్చడం వల్ల వచ్చే పొగను పీలిస్తే క్యాన్సర్ వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మిషన్ మండల కోఆర్డినేటర్ ప్రభాకరరావు, పంచాయతీ కార్యదర్శి సందీప్, ప్రజలు పాల్గొన్నారు.

వినియోగదారులు ప్రశ్నించే హక్కు కలిగి ఉండాలి

చిలకలూరిపేట: కొనుగోలు చేసే వస్తువుల నాణ్యత, ధరలను ప్రశ్నించే హక్కు వినియోగదారులకు ఉంటుందని వినియోగదారుల హక్కుల పరిరక్షణ ఫోరం అధ్యక్షుడు మురికిపూడి ప్రసాద్ చెప్పారు. ఫోరం ఆధ్వర్యంలో పెట్రోల్ కొనుగోలు చేసినప్పుడు ఎలా తనిఖీ చేసుకోవాలో అనే విషయంపై పట్టణంలోని కేబీ రోడ్డులో అవగాహన కార్యక్రమం, కరపత్రాల పంపిణీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోల్ బంకులో పెట్రోలు, డీజిల్ కొనుగోలు చేసేటప్పుడు మీటర్ రీడింగ్ తప్పనిసరిగా చూసుకోవాలన్నారు. పెట్రోల్ నాణ్యతను పరీక్షించుకోవడం, బంకులో ఉండే ఇతర వసతులను తెలుసుకొని ఉపయోగించుకోవడం, ఏదైనా నష్టపో



పెట్రోల్ కొనుగోలు జాగ్రత్తలపై కరపత్రం పంపిణీ చేస్తున్న ఫోరం సభ్యులు

యామనుకుంటే ఎవరికి ఫిర్యాదు చేయాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫోరం ఉపాధ్యక్షుడు డాక్టర్ విద్యాసాగర్, కార్యదర్శి రవినాయక్, కోశాధికారి బీబీ విక్రమ్, సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు సభ్యులు పాల్గొన్నారు.